క్లుప్తంగా

నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకులు అందజేస్తున్న యువనేస్తం సభ్యులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం భైరవఎస్టీ కాలనీకి చెందిన రెండు కుటుంబాలకు సోమవారం యువనేస్తం సభ్యులు 30 కేజీల చొప్పున బియ్యం, కూరగాయలు అందజేశారు. యువనేస్తం అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మునిశేఖర్ మాట్లాడుతూ భైరవ ఎస్టీకాలనీకి చెందిన రామయ్య, దంతాలయ్య కుటుంబాల ఆర్థిక పరిస్థితి అధ్వానంగా ఉందని తెలిపారు. వారు సాయం కోసం తమ సంస్థ వలంటీర్ హేమ ద్వారా కోఆర్డినేటర్ నాగమణిని సంప్రదించారని తెలిపారు. ఈ క్రమంలో వారికి బియ్యం, నిత్యావసర సరుకులు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జశ్వంత్, వెంకటేష్, స్రవంతి పాల్గొన్నారు.

15న జగనన్నకు చెబుదాం

వరదయ్యపాళెం: మండల కేంద్రమైన వరదయ్యపాళెం ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ఈ నెల 15న జగనన్నకు చెబుదాం కార్యక్రమం జరగనున్నట్లు ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు జరిగే కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు హాజరవుతారని చెప్పారు. సుదీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని సమస్యలను ఈ కార్యక్రమంలో విన్నవించుకోవచ్చని వివరించారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

టపాకాయ పేలి గాయాలు



టపాసులు పేలి తెగిపడిన చేతి వేళ్లు

సత్యవేడు: మండల పరిధిలోని రాజుల కండ్రిగ గ్రామానికి చెందిన చరణ్(14) దీపావళి రోజున టపాసులు కాల్చుతుండగా చేతివేళ్లు పూర్తి తెగిపడ్డాయి. చేతిలోని రెండువేళ్లకు తీవ్ర గాయం కావడంతో సత్యవేడు ఆస్పత్రికి తీసుకువచ్చి ప్రథమ చికిత్స చేశారు. డాక్టర్లు పరీక్షించి తిరుపతికి రెఫర్ చేశారు.

నేడు మత్తేరిమిట్టలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

వరదయ్యపాళెం: మండలంలోని మత్తేరిమిట్ట సచివాలయంలో మంగళవారం జరిగే వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హాజరుకానున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో మండలంలోని అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక సర్పంచులు, ఎంపీటీసీలు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

గుంతలు పూడ్చివేత



గుంతలపై మట్టి కప్పి జేసీబీతో చదును చేస్తున్న దృశ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని అరుంధతివాడకు వెళ్లే దారిలో గుంతలు ఉండడంతో రాకపోకలకు జనం ఇబ్బంది పడేవారు. విషయం తెలిసి సోమవారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్మల రాఘవయ్య మాదిగ మట్టిని తోలి పూడ్చారు. గుంతల్లోకి వర్షపు నీరు చేరి బురదమయం కావడంతో జనం నడవడానికి ఇబ్బంది పడుతుండడంతో తన సొంత నగదు వెచ్చించి గుంతలకు మట్టిని తోలారు. దీంతో అరుంధతివాడ వాసులు సంతోషం వ్యక్తం చేశారు.

మాజీ సర్పంచ్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

సత్యవేడు: శ్రీసిటీ పరిధిలోని చెంగంబాకం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మునికృష్ణయ్యపై శ్రీసిటీ పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు అయింది. చెంగంబాగం గ్రామంలోని లావెంజర్ హోటల్లో పనిచేస్తున్న చెంగమ్మ, ధనమ్మ, చెంగమ్మ అనే ముగ్గురు మహిళల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ హరిప్రసాద్ తెలిపారు. వివరాలు ఇలా.. కృష్ణా లావెంజర్ హోటల్లో ముగురు కార్మికులుగా పని చేస్తున్నారు. హోటల్ నిర్వహణ బాధ్యతలు చూస్తున్న మునికృష్ణయ్య మూడురోజుల కిందట హోటల్లో ఆహార పదార్థాలు వృథా చేస్తున్నారని విరుచుకుపడి, వేతనం కూడా ఇచ్చేదిలేదంటూ కులం పేరుతో దూషించాడు. ఈ నేపథ్యంలో తీవ్ర ఆవేదనకు గురైన చెంగమ్మ, ధనమ్మ, చెంగమ్మ శ్రీసిటీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు మాజీ సర్పంచ్ మునికృష్ణయ్యపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. శ్రీసిటీ డీఎస్పీ జగదీష్‌నాయక్ విచారణ జరపనున్నారు.

వైభవంగా కేదార గౌరీవ్రతం









కీళపూడిలో విశేష అలంకరణలో గౌరీదేవి సమేత జలకంఠేశ్వర స్వామి, పాపానాయుడుపేటలో విశేషాలంకరణలో గౌరీ దేవి, కీళపూడిలో విశేష అలంకరణలో గౌరీదేవి సమేత జలకంఠేశ్వర స్వామి, చిందేపల్లిలో కేదార గౌరీ వ్రతం ఆచరిస్తున్న మహిళలు

సత్యవేడు: దీపావళి మరుసటి రోజు వచ్చే అమావాస్య రోజున మహిళలు 'కేదార గౌరీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో' నిర్వహించారు. సత్యవేడులో సోమవారం పలు ఆలయాల్లో కేదార గౌరీ వత్రాన్ని పెద్దఎత్తున ఆచరించారు. అమ్మవారి విగ్రహాలను అలంకరించి పూజలు చేశారు. మహిళలు ఉదయాన్నే ఇంటిని శుభ్ర చేసి, ఇంటిద్వారాలకు మామిడాకుల తోరణాలు కట్టి పసుపు కుంకుమతో అలంకరించారు. అమ్మవారి పూజకు 21 రకాలను సమర్పించారు. సత్యవేడు వేణుగోపాల స్వామి ఆలయం, వీరభద్రస్వామి ఆలయంలోని సర్వమంగళాదేవి ఆలయం, కాళమనాయుడుపేటలోని విఘ్నేశ్వర స్వామి ఆలయాల్లో కేదార గౌరీవ్రతం నిర్వహించారు. అనంతరం చేతికి నోముదారాలు ధరించారు.

నాగలాపురంలో..

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి గ్రామంలో వెలసిన శ్రీ సర్వమంగళ సమేత శ్రీ పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో శ్రీ మరగదాంబిక అమ్మవారిని గౌరీదేవిగా అలకంరించి భక్తిశ్రద్ధలతో కేదార గౌరీ వ్రతం నిర్వహించారు. గౌరీ వ్రతం నోములు చెల్లించుకోవడానికి భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ ఏవీఎం.బాలాజి రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ అధికారి కె.రామచంద్రా రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఏర్పేడు: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం దీపావళిని పురస్కరించుకుని కేదార గౌరీ వ్రతం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పాపానాయుడుపేట ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి, చిందేపల్లిలోని పార్వతీ సమేత సిద్దేశ్వర స్వామి, కొత్తకండ్రిగలోని వినాయక స్వామి, అంజిమేడు రామాలయం, గుడిమల్లం పరశురామేశ్వర స్వామి తదితర ఆలయాల్లో వ్రతం నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నోములు నోచుకున్నారు.



సత్యవేడు: సర్వమంగళాదేవి ఆలయంలో..



కొత్తకండ్రిగలో పూజలు చేస్తున్న మహిళలు

జలకంఠేశ్వరాలయంలో..

పిచ్చాటూరు: మండలంలోని శ్రీ భవానీ దేవి సమేత జలకంఠేశ్వరాలయంలో శనివారం కేదారగౌరీ వ్రతాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో శ్రీ భవానీ దేవి, జలకఠేశ్వర స్వామివారిని ఆశీనులు చేశారు. ముందుగా భవానీ దేవి అమ్మవారికి గౌరీదేవి అలంకరణ చేశారు. అర్చకులు వేదమంత్రాలు, గౌరీ వ్రతం కథను చదివి వినిపించారు. అనంతరం శ్రీ జలకంఠేశ్వర స్వామి, శ్రీ భవానీదేవి మూలవర్లను దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు అర్చకులు కల్పన తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు పలికారు.









సత్యవేడు: వేణుగోపాల స్వామి ఆలయంలో కేదార గౌరీ వ్రతం ఆచరిస్తున్న మహిళలు, నాగలాపురం: కేదార గౌరీ వ్రతంలో పాల్గొన్న భక్తులు, పిచ్చాటూరు: కీళపూడి జలకంఠేశ్వరాలయంలో గౌరీవ్రతం పూజల్లో పాల్గొన్న మహిళలు, శ్రీకాళహస్తీశ్వరాలయంలో..

వెంకన్న ఆలయంలో దీపావళి ఆస్థానం



కల్యాణ వెంకన్నకు దీపావళి ఆస్థానం నిర్వహిస్తున్న అర్చకులు

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం దీపావళి ఆస్థానాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు స్వామివారి అక్షింతలను అందజేశారు. ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి అర్చకులు నిత్యపూజా కైంకర్యాలను పూర్తి చేశారు. శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం చేసి, ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం గంట, నైవేద్యం తదితర కార్యక్రమాలను పూర్తి చేసిన అర్చకులు ఆస్థాన మండలంలో పెద్ద శేషవాహనంపై ఉత్సవమూర్తులను అధిష్టింపజేశారు. అనంతరం ఆలయ అధికారులు టీటీడీ తరఫున సమర్పించిన పట్టువస్త్రాలను ఉత్సవమూర్తులకు అలంకరించారు. అనంతరం అర్చకులు ఆస్థానం నిర్వహించి అక్షింతలతో తలంబ్రాలు పోసి, నైవేద్యాలను సమర్పించారు. కార్యక్రమాలను ఆలయ అధికారులు నాగరాజు, భరత్, భద్రతా జమేదార్ రాజశేఖర్ పర్యవేక్షించారు. దీపావళి నోములు సందర్భంగా మండలంలో మహిళలు సోమవారం ఆలయాల్లో నిర్వహించిన గౌరీవ్రతంలో పాల్గొన్నారు. స్థానిక పరాశరేశ్వరస్వామి ఆలయంలో ఉదయం నుంచి మహిళలు గౌరీ వ్రతంలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు





అమరేశ్వరస్వామికి ప్రత్యేక పుష్పాలంకరణ, అన్నపూర్ణదేవికి పూజలు చేస్తున్న పూజారి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఉగ్గుమూడి గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో శ్రీ అన్నపూర్ణ సమేత అమరేశ్వరస్వామికి సోమవారం అమావాస్య పూజలను గ్రామస్తులు, భక్తులు ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీ అన్నపూర్ణ సమేత అమరేశ్వరస్వామి విగ్రహాలకు అభిషేకాలు చేసి, పూలతో అలంకరించారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొనగా, తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

చెడ్డీ గ్యాంగ్‌తో అప్రమత్తంగా ఉండాలి

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తి పట్టణ శివారు ప్రాంత ప్రజలు చెడ్డీ గ్యాంగ్‌తో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు తెలిపారు. తిరుపతి నగరంలో దొంగతనాలకు పాల్పడుతున్న ఈ చెడ్డి గ్యాంగ్ శ్రీకాళహస్తి పట్టణ ప్రాంతంలోను సంచరిస్తున్నట్లు సమాచారం ఉందని తెలిపారు. దీనిపై ఇప్పటికే పోలీసు ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటుచేసినట్టు పేర్కొన్నారు. తద్వారా చెడ్డీ గ్యాంగ్‌ను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. రాత్రివేళల్లో ఇంటి తలుపులు తట్టడం, కాలింగ్ బెల్ కొట్టడం, పెద్ద శబ్దాలు చేసి ప్రమాదంలో ఉన్నట్లు హెచ్చరించినా తొందరపడి తలుపులు తీయవద్దని హెచ్చరించారు. ఎవరైనా అనుమానితులు సంచరిస్తున్నట్లు తెలిస్తే వెంటనే 100 కాల్ చేయాలని తెలిపారు. శ్రీకాళహస్తి పట్టణ ప్రజలతోపాటు, శ్రీకాళహస్తి రూరల్, తొట్టంబేడు మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఈ గ్యాంగ్ పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

పూర్వ విద్యార్థుల కలయిక



భేటీ అయిన పూర్వ విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో 1989–90 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు సోమవారం పాఠశాల్లో కలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని నిర్ణయించారు.

వైభవంగా అమావాస్య ఉత్సవం



ఉత్సవానికి బయలుదేరుతున్న స్వామి, అమ్మవార్లు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం అమావాస్య ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయ అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లకు విశేష అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. తర్వాత మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల నడుమ స్వామి, అమ్మవార్లను చప్పరాలపై అధిష్టించి ఊరేగించారు. ప్రజలు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో సాగర్‌బాబు, పాలక మండలి సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు అందజేత



దుస్తులు అందజేస్తున్న గున్నేరి కిషోర్‌రెడ్డి

ఏర్పేడు: స్థానిక మల్లికార్జున్ పూల డెకరేషన్ దుకాణంలో సోమవారం వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి పేదలకు దుస్తులు అందజేశారు. ఏర్పేడులోని పూల డెకరేషన్ దుకాణంలో ఆయుధపూజ నిర్వహించారు. 19 మంది పేదలకు నూతన దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య, వైఎస్సార్ సీపీ నాయకుడు కుప్పాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల వితరణ



పారిశుద్ధ్య కార్మికులతో దాత గోవిందస్వామి

నారాయణవనం: మండలకేంద్రమైన నారాయణవనం గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు దాతలు సోమవారం దుస్తులను వితరణ చేశారు. సర్పంచ్ శారద గణేశన్ మాట్లాడుతూ నారాయణవనానికి చెందిన నూలువస్త్రాల తయారీదారుడు గోవిందస్వామి పంచాయతీలో పనులు చేస్తున్న 14 మంది గ్రీన్ అంబాసిడర్లకు చీరలు, పంచెలు, టవళ్లను అందజేశారు. ఈ సందర్భంగా శారదగణేశన్ మాట్లాడుతూ వీధులను, మురుగు కాలువలను శుభ్రం చేసే కార్మికులను గౌరవించడం బాధ్యతగా అనుకుని గోవిందస్వామి దుస్తులను అందజేయడం సంతోషమన్నారు. కార్యక్రమంలో చిన్నదొరై, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇస్కాన్‌లో గోపూజ, గోవర్ధన్ మహోత్సవం

తిరుపతి కల్చరల్: శ్రీకృష్ణ భగవానుడు గోవర్ధన గిరిని ఎత్తి గోపాలురు, గోవులను సంరక్షించిన రోజును పురస్కరించుకొని ఇస్కాన్ మందిరంలో మంగళవారం గోపూజ, గోవర్ధన్ పూజా మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు రేవతిరమణదాస్ తెలిపారు. ఆయన సోమవారం ఇస్కాన్ ప్రతినిధులతో కలిసి గోవర్ధన్ పూజా మహోత్సవం పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గోవర్ధన్ పూజా మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయంలో శ్రీకృష్ణుని గోవర్ధన గిరి ఎత్తిన ప్రతిభను ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 8.30 గంటలకు గోవర్ధన్ లీలపై ప్రవచనం చేపడుతున్నట్లు తెలిపారు. 11.30 గంటలకు శ్రీగిరి గోవర్ధన్‌కి మహా శంఖాభిషేకం నిర్వహిస్తామన్నారు. అలాగే 27వ తేదీ వరకు ఇస్కాన్ మందిరంలో ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు కార్తీక దామోదర హారతి చేపట్టనున్నట్లు తెలిపారు. 17న ఇస్కాన్ వ్యవస్థాపక ఆచార్యులు భక్తి వేదాంత స్వామి శ్రీల ప్రభుపాదుల వారి తిరోభావ దినోత్సవం చేపడుతున్నట్లు తెలిపారు.

నేటి నుంచి ధ్యానారామంలో కార్తీకమాస రుద్రాభిషేకం



ఆభరణాలు బహూకరిస్తున్న దాతలు

తిరుపతి కల్చరల్: ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలో నున్న ధ్యానారామంలోని బృహదీశ్వరస్వామికి మంగళవారం నుంచి నెల రోజులు లోక క్షేమాన్ని కాంక్షిస్తూ రుద్రాభిషేకం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ప్రతి రోజూ ఉదయం 6 నుంచి 7 గంటల వరకు లఘున్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకాన్ని శైవాగమ పండితులతో చేపడతారు. ఈ కార్యక్రమాన్ని ఎస్వీ భక్తి ఛానల్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

నాగాభరణం, త్రిశూలం బహూకరణ

ధ్యానారామంలోనున్న బృహదీశ్వరస్వామికి తిరుపతికి చెందిన ఆర్.శ్యాంసుందర్‌రెడ్డి, డాక్టర్ మునిశంకర్‌రెడ్డి, వేదవర్సిటీ ఫైనాన్స్ ఆఫీసర్ పి.అంజిరెడ్డి రూ.4 లక్షలు విలువైన పంచలోహాల నాగాభరణం, త్రిశూలాన్ని బహూకరించారు. అలాగే తిరుపతికి చెందిన కమల శ్రీనివాసన్ రూ.20 వేలు పరదాలు అందజేశారు. వేదవర్సిటీ రిజిస్ట్రార్ ఏవీ.రాధేశ్యామ్, టి.బ్రాహ్మాచార్యులు, ఆర్.సత్యనారాయణ, పి.నీలకంఠం పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



దాతలకు స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక అందజేస్తున్న అంజూరు శ్రీనివాసులు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన సూర్యనారాయణ రూ.1,08,000 విరాళంగా అందజేశారు. ఆయన కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం శ్రీకాళహస్తీశ్వరస్వామి దర్శనానికి వచ్చారు. పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులును కలిసి విరాళం అందజేశారు. వారికి అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనం, స్వామి అమ్మవార్ల శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలతో సత్కరించారు. పాలక మండలి సభ్యులు సుబ్బారెడ్డి, అధికారులు మయూర్ కుమార్, కామేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్ఎస్‌యూలో దీపావళి పండుగ



సంస్కృత వర్సిటీలో వెలిగించిన దీపాలు

తిరుపతి సిటీ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఆదివారం సాయంత్రం దీపావళి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. వర్సిటీలో రఘునాథాచార్యముక్త ప్రాంగణంలో సుందరకాండ పారాయణం చేశారు. అనంతరం లక్ష్మీదేవి పూజ చేశారు. విద్యార్థులకు దీపావళి విశిష్టతను వివరించారు. దీపావళి పండుగలో 'దీప ఆవళి' అంటే దీపముల వరుస అని, దీప ప్రజ్వలన అనేది మనసులోని భావాన్ని బయటకు తీసుకురావడమని వివరించారు. దీపమే పరబ్రహ్మ అని, జ్ఞాన దీపాన్ని వెలిగించి శాస్త్రాల్లోని జ్ఞానాన్ని సమాజానికి అందించాలన్నారు. అనంతరం విద్యార్థులు 10 వేలకు పైగా దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో వీసీ ధర్మపత్ని రామలక్ష్మి, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ రమాశ్రీ, అధికారులు ఆచార్య చక్రవర్తి రాఘవన్, సత్యనారాయణ, డిప్యూటీ రిజిస్ట్రార్ వైవీ కృష్ణారావు పాల్గొన్నారు.

క్విజ్ గ్రాండ్ ఫినాలే ఏర్పాట్ల పరిశీలన



క్విజ్ పోటీల ఏర్పాట్లను పరిశీలిస్తున్న స్మార్ట్ సిటీ ఎండీ హరిత

తిరుపతి తుడా: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్మార్ట్ సిటీ, తిరుపతి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం కచ్చపి ఆడిటోరియంలో క్విజ్ గ్రాండ్ ఫినాలే నిర్వహిస్తున్నట్లు స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ హరిత తెలిపారు. ఆమె సోమవారం సాయంత్రం అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఇందిరా మైదానంలోని ఇండోర్ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన పోటీలకు సుమారు 101 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. వారిలో ముందు వరుసలో నిలిచిన 8 పాఠశాలల విద్యార్థులను గ్రాండ్ ఫినాలేకి ఎంపిక చేశామని, వారికి బాలల దినోత్సవం సందర్భంగా మంగళవారం మధ్యాహ్నం పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేస్తామన్నారు. వారికి మొదటి బహుమతిగా రూ.లక్ష, రెండో బహుమతి కింద రూ.50 వేలు, మూడో బహుమతి రూ.25 వేలు అందజేస్తామని పేర్కొన్నారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి 3 వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆయా పాఠశాలల యాజమాన్యం విద్యార్థులు సరైన సమయంలో వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కమిషనర్ వెంట స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి ఉన్నారు.